# వేళ్లుతెగిన...

"జోలాలీ, జోలాలీ...జో...లాలీ.." లచ్చుమమ్మ జోల పాడుతోంది. తొలకరి వాన జల్లు తెరిపిచ్చేక, వీచే గాలికి, ఆకులాడిస్తూ, పులకరించే లేత మొక్కలా, ఊయలలో పాప... కుశాలగా వుంది. పడమటి కొండల్లోంచి, తలెత్తి, లోకాన్ని చూసే చందమామలా, పాప మూతలు పడే కన్రెప్పల్ని విప్పుకు చూస్తోంది నాయనమ్మను. చిన్నగా, బోసి నవ్వులు నవ్వుతోంది.

"ముయ్యి, ముయ్యి.... కళ్లు ముయ్యి. హన్నా... యింకా బబ్బోదూ.. (నిద్రపోదూ..)! ఆఁ! అద్గద్గో.. రాయే పిల్లీ, రా,రా, యిదిగో మిటకరించి చూస్తంది, యెత్తుకుపో, దీన్ని..." బెదిరిస్తూ, ఊయల కాస్త జోరుగా ఊపింది లచ్చుమమ్మ.

పాపకు అర్థమై పోయింది. ముక్కూమూతి బిగించేసింది. బోసినవ్వుచెరిపేసింది. కాళ్లు రెండూ ఆడిస్తూఊయల గుడ్డను తన్నుతూ, సన్నగా గుణిసింది.

లచ్చుమమ్మ, అలుకబూనిన మనుమరాలిని చూసి, ముసి ముసిగా నవ్వుకుంటూ 'గడుసుతల్లి' అని బుగ్గ మీద నుతారంగాపొడిచి-

"..లేత్తల్లీ, పిల్లి నీకోసం గాదు, అదిగో, ఆ యెదురింటి పాప లేదా? హమ్మ! గడుగ్గాయి ! ఆళ్ళమ్మకి యింటిపన్లున్నాయా ? పాప, బజ్జోవాలా? తానమాడింది. గుగ్గిలం ధూపమేసుకొంది. బొట్టూ, కాటుక పెట్టుకుంది. కడుపు నిండా పాలు తాగింది. కళ్లు మూసి, బజ్జోవొచ్చుగదా? చూడు, ఉయ్యాల్ల యెలగ యిరగబడతందో? నువ్వు గాదమ్మా! అదే, అ యెదురింటోళ్ల పిల్ల! దాన్నే, పిల్లి యెత్తికెళిపోద్ది, నిన్ను ముట్టనిస్తానా? నువ్వు మా బంగారు కొండవి, రతనాల దండవి. కళ్లు మూసీయమ్మా... మూసీ, మూసీ, మూసి..."

తల్లి అవస్థను ప్రక్క గదిలోంచి గమనిస్తోన్న ప్రభాకర్, నవ్వుతూ.

"పాప చూడు, మా అమ్మనెలా అవస్థ పెడుతోందో.." అన్నాడు మాధవితో.

"పాప, అత్తయ్య దగ్గర చేరికయి పోయిందండి.." యింకేదో ఉద్దేశంతో, ఉపోద్ఘాతంగా జవాబిచ్చింది మాధవి.

"పిల్లల ఆలనా, పాలనా చూడటం.. యీ తరం ఆడవాళ్లకి చేతనవదు" ప్రభాకర్ అసంకల్పితంగానే అనేసాడు. నోరు జారేక, నాలుక కరుచుకున్నాడు.

"పిల్లల పెంపకం కేవలం ఆడవాళ్ల డ్యూటీయా?" సిద్ధమయిపోయింది మాధవి.

"జోలపాట... మగవాళ్లు పాడితే ప్రమాదం. పిల్లలు బెదిరిపోతారు..." యుద్ధం పొలిమేరల్లో జోక్ వేసాడు ప్రభాకర్.

ఆ జోక్‌ను సంధిగా స్వీకరించి -

"ఈల పాటలు మీవీ, జోల పాటలు మావీ...హు! "నిరసన వ్యక్తంతో ఆగింది మాధవి, మళ్లీ, వెంటనే-

"..యీ రోజు బయల్దేరి పోవాలి. అత్తయ్యతో, పాప విషయం కదపండి.." అంది
ప్రభాకర్ తల్లి వైపు చూసేడు.

ఆవేటి మాసపు.. చద్ది వేళ! సూర్యుడు వేడికంటే, వెలుగు యెక్కువ ప్రసాదిస్తున్నాడు.

ఆ వెలుగులో లచ్చుమమ్మ - అనంతంగా, ఆమె రెక్కల్ని ఊయలజేసి ఊపుతున్నట్లుగా కన్పించుతోంది. అలా చూస్తూ వుండి పోయేడు ప్రభాకర్!

"..మీకు అన్నింటికీ నెగిటివ్ థింకింగే!" యెన్నింటి విశేషాలనో సూచించే రీతిలో, చిరాగ్గా పలికింది మాధవి.

ప్రభాకర్ నిట్టూర్చేడు. రెండు మూడు వారాలుగా అస్తిత్వంలోకి వచ్చిన ఘర్షణ...! పరిష్కారం తోచటం లేదు ప్రభాకర్‌కి!

"నేను ట్రెనింగ్‌కి వెళ్లటం మాత్రం ఖాయం.."దృఢంగా చెప్పింది మాధవి. ఆ మాట - అప్పటికి యెన్నిసార్లు అన్నదో..!

గతంలో ఓసారి వచ్చిన అవకాశాన్ని - యింటి పరిస్థితుల కారణాన వొదులుకుంది! ఇపుడు మళ్లీ.. అవే కారణాలు..! ఈసారి, యే పరిస్థితుల్లోనూ అలా వొదులుకోదల్చ లేదు మాధవి.

"హమ్మయ్య! తుఫాను ఆగింది. కళ్లు మూసింది తల్లి.." అంటూ, వచ్చింది లచ్చుమమ్మ.

"అమ్మా, మధ్యాహ్నం బయల్దేరుతున్నాం"... తర్వాత మాట.. పలుకలేక పోయేడు ప్రభాకర్.

"రెండ్రోజులు అగావుగా వుండలేరు. నౌకరీలంటారు. దూరా, బారాన వున్నారు. మళ్లా, యెన్నాళ్లకొస్తారో.." తల్లి విచారంగా.

"నెలకోసారి వొస్తానత్తయ్యా.." మాధవి, ఆనందంగా, భర్త కదపలేని విషయాన్ని మర్మంగా పలికింది.

లచ్చుమమ్మకు కోడలి మాట నమ్మశక్యంగా లేదు. ఏడాదికొసారి, సంక్రాంతికి పెద్దలకీ, పేరంటాళ్లకీ మొక్కుకోడానికైనా రానివాళ్లు, నెలకోసారి వస్తారా..?

ప్రభాకర్, కక్కనూ లేక మింగనూ లేక మధనపడుతున్నాడు. ఇంతలో-

"...సంపెస్తండు నాయినో, లచ్చు మమ్మత్తా! సంపేస్తండోలమ్మో..." గోల, గోలగా యేడుస్తూ, యెదుటి వాసలోంచి, భూలోక వొచ్చింది. ఆమె వెనుకనే, కప్పుకున్న కోకగుడ్డ భుజాల మీదకు యెగదోసి, కోపంతో రొప్పుతూ వొచ్చేడు ఆమె భర్త.

"..కొట్టి, సంపెస్తండత్తా.." లచ్చుమమ్మ ప్రక్కకు చేరింది భూలోక.

"కొట్టడమా? కోదండ మేలగట్టీయాల నిన్ను. ప్రేణాల కంటా - పైసలెక్కువట దీనికి! పెద్దమ్మా, నువ్వే సెప్పు - మనిసి డబ్బుని పుట్టించేడా? డబ్బు మనిసిని పుట్టించిందే? సెప్మీ! నా ప్రేణం కంటే.. దీనికి పైసలెక్కువట..." ఆయాస పడిపోతూ, భూలోక భర్త.

".. నోరిప్పితే అన్నీ అబద్దాలే, నే నలగన్నానా?" భూలోక.

"మరెలగన్నావే...?" నాలుక కరుస్తూ భర్త.

"కాళ్లూ సేతులూ బాగున్నినాడు - కాణిపరకా యెనకెయ్యా అంతే యినకండా - సారాకీ సరదాలకీ ఆర్పేసినావు. ఇప్పుడు - జబ్బో అంతె యెక్కడ నుండి వస్తాది - డబ్బూ అన్నాను. నీనన్నది తప్పేటి? సెప్పత్తా? ఆ మాత్రంకే కొడతాడా?" తగువు విడమరిచింది భూలోక.

"డబ్బులు చూసుకొని - వస్తాయేటి జబ్బులు? చెప్మీ పెద్దమ్మా..."

"ధరమాసపత్రికి - యెల్ల మంతన్ను గాదేటి?

"...నాకు జబ్బు తగ్గటం నీ కిష్టం లేదేటే?

"..చీటీకి దాచిన డబ్బులు చెల్లగొడితే గాని, నీకు ఊస్టం తగ్గుతాదేటి? మాయముండ ఊష్టం.."

"అదా! ఆ పలుకే వొద్దన్నాను.." చెయ్యెత్తాడు.

లచ్చుమమ్మ అడ్డుకుంది. భూలోకకు నచ్చచెప్పింది. చీటీ తర్వాత నెలలో కట్టొచ్చు, వైద్యం ముందు చేయించమంది.

భూలోక, గుణుసుకుంటూ, భర్త చేతిలో డబ్బులు పెట్టి-"....పొద్దెక్కినా ముసుగు తియ్యక నువ్వు తుంగొన్నపుడే అనుకున్ను... యీ డబ్బులికి గాలొచ్చిందని. ఎల్లు, డాక్టరు యెదాన పోసీ..." అంటూ, అక్కడి నుండి కదిలింది. ఆమె వెనకే, భర్తా వెళ్లిపోయేడు.

"..దీనికేమొ...వొస్తువులు మోజు దీనికి తగినట్టుగ - అడ్డమైన స్కీములొచ్చేయి పట్నంకి. ఊరికీ దూరం తగ్గిపోయింది. బీరువాలట, పరుపులట, టీవీలట.. రిక్షాల్లంట పెట్టి ఊరల్లా తిప్పి, స్కీములు గట్టిస్తన్రు. వేలం వెర్రి! భూలోక ససలు ఆపలేం, దాని మొగుడికి యివి నచ్చవు. రోజుకోసారి తగువాడితేగాని.. పొద్దుబోదు ఆల్లకి.." లచ్చుమమ్మ వివరించింది.

ప్రభాకర్‌కి తల్లి మాటలు ఆశ్చర్యాన్ని కల్గించేయి. ఎంత సాధారణమైన మాటలతో వస్తు మోజు గురించి వివరించింది...!

భార్యా భర్తల మధ్య ఘర్షణకు - యిదొక బలమయిన కారణమా? ప్రభాకర్ మనసు మూలల్లో.. యెక్కడో.. గతం కదలాడింది...

"అవసరమైనవి కొనుక్కోమా? గ్యాస్‌స్టవ్, మిక్సీ, వాషింగ్ మెషిన్.. యేది.. యిందులో.. యేది అనవసరమైంది?" మాధవి గొంతు చించుకు వాదిస్తోంది.

"అవసరాలు.. ఆర్థిక వనరుల బట్టి వుండాలి.." ప్రభాకర్, యింకా సౌమ్యంగా పలకలేక పోయేడు.

"..అంటే, ఆర్థిక వనరు మీ ఒక్కరి నుండే అనిగదా మీ భావం? అందుకని, హద్దులు గీచుకోవాలి నేను. నలుగురిలా ఆశలుండ గూడదు. అసలు, అసలు, మీకేం తెల్సులెండి వంటింటి శ్రమ! అది తెలిస్తే యిలా తగువుకి దిగేవారు కారు.......

యెక్కడివరకో వెళ్లింది ఆ ఘర్షణ, వంట గదిలో కేంద్రీకృతమైన తుఫాను - పడకగదీ, డ్రాయింగ్ రూము వరకూ విస్తరించింది. ఒకరికొకరం తోడు అనుకున్న ఆ జంట - ఒకరితో మరొకరు మాట్లాడుకోకుండా.. వారం రోజులు గడిచేయి.

అప్పుడే, మాధవి ఏమి ఆలోచించుకుందో- ఉద్యోగ ప్రయత్నం చేసి ఒక ప్రవేటు కంపెనీలో చేరింది.

"..యిది పరిష్కారమని నీకు చెప్పానా?" యెక్కడో, కుత కుతలాడుతోంది ప్రభాకర్ మనసులో.అదే, పురుషాహంకారం.. అంటుంది మాధవి.

"అంటే, నువ్వు చెప్పే పరిష్కారాలే.. నేను యెంచుకోవాలా?"

"..ఛీఛీ! నువ్వు అర్థం లేకుండా మాట్లాడుతావు.." విసుక్కుంటూ,ప్రభాకర్.

"..పెళ్లికి ముందు - యిలా మాట్లాడ లేదా నేను?" సెన్సిటివ్‌గా ఫీలయింది మాధవి.

"ఛ..నీతో వాదన పెట్టుకోవడం తప్పు" వీధిలోకి వెళిపోయేడు ప్రభాకర్ విసురుగా.

'నిన్ను పెళ్లిచేసుకోవటం తప్పు".. అన్నట్లుగా -విన్పించింది మాధవికి .

గతం పొరల్లోంచి, ఒక ఘర్షణను భూలోక దంపతుల ఘర్షణ గుర్తు జేసింది ప్రభాకర్‌కి.

ఘర్షించని దంపతులున్నారా? దాంపత్యంలో ఘర్షణ ప్రధానమా? ఐక్యత ప్రధానమా? ప్రభాకర్ మెదడులో ప్రశ్నలు...

ఇంతలో, ఊయలలో పాప కదిలి , ఏడ్వసాగింది.

"అప్పుడే వొదిలేసింది నిద్ర! కోడి కునుకు.." అంటూ, ఊయలలోంచి మనవరాలిని తీసింది లచ్చుమమ్మ. పాప, కళ్లు ఫులుముకొని, కేర్ మంటూ యేడుపు యెత్తబోతూ - నాయనమ్మ మొహం చూసి నవ్వింది.

అపుడు మాధవి - "పాపని నీ దగ్గర వదిలేస్తామత్తయ్యా" అంది.

లచ్చుమమ్మకేమీ బోధపడలేదు. కొడుకు వైపు చూసింది.

"ట్రైనింగ్‌కి వెళ్తాదట. నీకు యిబ్బందేమో కదమ్మా..?" ప్రభాకర్, యేం అనబోయి అలా అన్నాడో!

లచ్చుమమ్మకు ఆ ప్రశ్న యెప్పటిదోలా విన్పించింది. ఎన్నడో.. తన తండ్రి. తొలినాటి తన కాపురాన్ని చూడటానికి వొచ్చినపుడు వేసిన ప్రశ్న... గుర్తు కొస్తోంది...

మూడిళ్ల లోగిలి, ఉమ్మడి కుటుంబం. ఇంటికి పెద్ద కోడలుగా వొచ్చింది లచ్చుమమ్మ అత్తా, మామలు జవసత్వాలుడిగిన వారు. భర్త ఊరి మీద బలాదూర్. ఇద్దరు మరుదులూ, ఆడపడుచూ.. లచ్చుమమ్మ కొంగు చాటు తిరుగుతారు.

కాపురం తొలినాళ్లలోనే -అందరికీ చేరువైన కూతుర్ని చూసి పొంగిపోయేడు లచ్చుమమ్మ తండ్రి. వియ్యంకుడు బలవంతం చేస్తే ఆ రాత్రి వుండిపోయేడు.

తెల్లవారు ఝాము... మెలకువ వచ్చేసింది.లేచి, మంచమ్మీదనే అలా కూర్చుంటే-పెరటి గదిలో కవ్వం.. సవ్వడి విన్పిస్తోంది. మజ్జిగ చిలుకుతోంది లచ్చుమమ్మ అప్పటకే లేచి. ఆశ్చర్యంగా, అలా చూస్తూ వుండి పోయేడు - లచ్చుమమ్మ తండ్రి.

లచ్చుమమ్మ - కవ్వం ఆపేసి, మజ్జిగ కుండ - ఉట్టిమీద పెట్టింది. వెన్నపూస మరో గిన్నెతో పోపుల బీరువాలో పెట్టింది. అట్నించి వచ్చి, మండువలోని, నీళ్లకుండీలో నానబెట్టిన వేపపుల్ల తీసి, నోట్లో పెట్టుకొని - మూలనున్న చీపురు అందుకుంది. పెరడూ, వసారా, మండువా తుడిచింది. పల్లుతోముపుల్ల బద్దలు చేసి, నాలుక గీచి, పుల్ల విసిరేసి - మొహం కడుక్కుంది. బిందెతో నీళ్ల తొడి, పశువుల సాలలో ఆవుపేడ తీసుకొచ్చి - బిందెలో కలిపి ఆ నీళ్ళతో వీధివాకిట కళ్ళాపి జల్లింది. ముగ్గు పిండి డబ్బా తెచ్చి, వాకిట... ముగ్గులు వేసింది. ఆ ముగ్గుల మీదకి... లేలేత సూర్య కిరణాలు ప్రసరించ నారంభించాయి.

ఈలోగా, యింట్లో ఒక్కొక్కరూ లేచారు. ఒకరికి పలకర్ర పుల్ల, మరొకరికి తుండుగుడ్డ, యింకొకరికి చెంబుతో నీళ్లు అందిచ్చింది.

పడక మంచమిచ్చాంచే - టీ కోసం భర్తగావుకేక!

వంట గదిలో ప్రవేశించింది లచ్చుమమ్మ. కట్టెలు తీసి, పొయ్యిలో పెట్టి-అగ్గిపుల్ల గీచింది. అవి పొగబారుతున్నాయిగానీ, అంటడం లేదు. పొగ గొట్టం తీసి, ఊపిరితిత్తుల్లోకి దూర్చింది. గదంతా.. పొగ నిండుకుంది. పొగ నిండిన వంట గదిలో - లచ్చుమమ్మ.. ఆకాశంలో కదిలే మేఘ శకలంలా కన్పిస్తోంది. తండ్రి, యిదంతా బాధగా చూసి, మంచమ్మీంచి లేచి వచ్చి-

"...యిన్ని పనులూ నువ్వే చేయ్యాలా తల్లీ?" ఈ యిబ్బందులన్నీ ఎలా పడుతున్నావమ్మా .... ... ? " అని అర్తిగా అడిగేడు.

అపుడేమి జవాబు చెప్పిందో లచ్చుమమ్మకు గుర్తులేదు.

గతంలోంచి, బయటికొచ్చి - కొడుకు వైపు చూస్తూ - "--నా యిబ్బందికేం గానీ, చంటిదాన్నొదిలేసి...." అంటూ కోడలివైపు చూసింది.

"ఉండగల్దు..." ప్రభాకర్ జవాబిచ్చేడు.

ఆ జవాబులో-యేదో అపశృతి విన్పించింది లచ్చుమమ్మకు దాంతో- "...దానికేటి నాయనా, అవుసిరమైతే - ఆ మాత్రం ఉండగలగాల అన్నీ మన వొళిమా?" కోడలు తప్పు చేయటం లేదనట్లుగా సర్ది చెప్పింది లచ్చుమమ్మ.

ఆ మాటకు మాధవి- "మీ కంటే, అత్తయ్యే ఫార్వర్డ్.." రిలాక్స్డ్‌గా అంది.

లచ్చుమమ్మకు- కోడలి మాట బోధ పడలేదు. ప్రభాకర్, మౌనంగా వీధిలోకి నడిచేడు.

ప్రభాకర్ మనసంతా.. పెనుగాలికి రెమ్మల్తో, కొమ్మల్తో ఊగిపోయే-తోటలా వుంది. అన్యమనస్కంగా, అలా వీధిలో నడుస్తూ.. వీధి చివరి శివాలయం దగ్గరకు చేరాడు. అక్కడ, ఒక పిల్లవాడు చేతిలో వెదురు కర్ర వేణువు పట్టుకు... "ఏని గోసీ, యేని ముద్రేసుకున్నో.. అన్నోరి నా కూలిరైతా.. అన్నా.." కరుణరస భరితంగా వాయిస్తున్నాడు. ఆ మధ్య ఆ గ్రామం లో జరిగిన జన నాట్యమండలి ప్రదర్శన చూసి, నేర్చుకున్నాడా పిల్లోడు,మరో పిల్లోడు, వెదురు కర్ర వంచి, తాడు గట్టి బాణం జేసి, నేరేడు పళ్ల కోసం గురి చూస్తున్నాడు.

ప్రభాకర్‌ని... శివాలయం మండపం మీద కూర్చున్న గుంపస్వామి గమనించి లేచి వచ్చేడు. గుంపస్వామి, ప్రభాకర్ యిద్దరూ బాల్య మిత్రులూ, కోటిపాం హైస్కూల్‌లో కలిసి, పదవ తరగతి వరకూ చదువుకున్నారు. గుంపస్వామి, పదవ తరగతి ఫెయిలయి, మళ్లీ పరీక్షకు వెళ్లలేదు. వ్యవసాయంలోకి దిగేడు. పెళ్లి, పిల్లలూ.. సన్నకారు రైతు!

ప్రభార్, గుంపస్వామి, దగ్గర గుండె విప్పుకోవాలనుకున్నాడు. గానీ, గుంపస్వామి యింకేదో విప్పేడు.

"..ఎమ్మార్వో వొస్తామన్నాడని కూచున్నాం. పట్టాదార్ పాసు పుస్తకాల గురించి..."

"..మన వివిఓ.. యేమంటాడు?" ప్రశ్నించేడు ప్రభాకర్.

"మన వివిఓ.. యెప్పుడు సక్రమంగా రికార్డులు రాసేడు? జిరాయితీలని బంజర్లనీ ,బంజర్లని... జిరాయితీలనీ రాస్తాడు. భూమి భాగోతం.. కరణం! ఈడి వల్లనే గదా.. భూమి తగువులు. అందలోకీ,

యిపుడు, రైతులంతా సంగం గట్టేరు. ఏపీవోకి అది నచ్చదు. ఒకడికి నచ్చినట్టు నడుస్తాదేటి సంగం?' ' ప్రశ్నించేడు గుంపస్వామి.

ప్రభాకర్ యేం చెప్పగలడు? మరొకరికి నచ్చినట్టు.. వ్యక్తులే నడవరు. సంఘం నడుస్తుందా? భార్యా, భర్తలే.. వొకరికి నచ్చినట్లు మరొకరు నడువటం లేదు?

ఎటు బోయినా, ఆలోచనలు మళ్లీ అక్కడికే వస్తున్నాయి! శివాలయం మండపం మీద మిత్రుల వద్దా, గుంపస్వామి వద్దా వీడ్కోలు తీసుకొని, భోజనాల వేళకు యింటికి చేరాడు ప్రభాకర్.

మాధవి ప్రయాణానికి హడావిడి పడ్తోంది. గబ, గబా భోజనం కానిచ్చేడు ప్రభాకర్. త్వరగా, తయారైపోయేడు. మాధవి సూట్‌కేస్ సర్దుకొచ్చింది.

పాప హాయిగా ఊయలలో నిద్ర పోతోంది.

" అత్తయ్యా, నెలలోపే వస్తాను. పాపని, మీచేతుల్లో పెట్టి వెళ్తున్నాను.." ఆ తర్వాత గొంతులో యేదో జీర.

మరి మాట్లాడలేక, దిగులు చూపుతో పాపను చూస్తూ ఊయల నెమ్మదిగా ఊపి, గడప దిగింది మాధవి.

మాధవికి, అప్పటిదాకా - తన ట్రైనింగూ, తనకు రాబోయేపదోన్నతీ, తమ కుటుంబ ఆర్థిక స్థితీ - యివే మెదడులో కదిలేవి. గానీ, యిప్పుడు కదలిక మనసులో వచ్చింది. దానికి, మాటలు చాలటం లేదు., వ్యక్త పరచటానికి.

మనం మానవ యంత్రాలం, మనకి మనసులెక్కడివీ? తొలికాన్పు బాబుని - ఎల్‌కేజీ వయసులో - రెసిడెన్షియల్ కాన్వెంటులో చేర్పించినపుడు - ప్రభాకర్ రియాక్షన్!

మాధవి.. మనసులో సన్నటి రంపపు కోత..!

" ఎందుకు ప్రభాకర్ - నన్ను నేరస్థురాలిగా చూస్తాడు? ఎందుకు నన్నుఅర్థం చేసుకోడు? ఇంటికీ, వంటకీ, సంసారానికీ మాత్రమేనా - నా జీవితం? ఒకే యూనివర్సిటీలో, ఒకే కోర్సులో, ఒకే వేవ్ లెంగ్త్‌లో కలిసిన వాళ్ళం..? ఇపుడు దూరానికి., కారణం? మనసుల్లో వెదకాలా? పరిస్థితుల్లో వెదకాలా?'

మాధవి ఆలోచనల్లోనే యిల్లు దాటింది. ప్రభాకర్, మౌనంగా సూట్‌కేస్ పట్టుకు నడుస్తున్నాడు. లచ్చుమమ్మ - తన జీవితానుభవం లోంచి - వాళ్లకేదో చెప్పాలని .. మనసు లోలోపల గింజాకుంటోంది. వీధి వాకిలిదాకా వాళ్లతో నడిచొచ్చి -

"..నాయినా, యేరు దాటినపుడు జేగర్త. పడవ మీద.. కోడలికి భయమెయ్యగల్దు జేగర్త .. " అంది లచ్చుమమ్మ, అంతకు మించి చెప్పాలనుకున్నదేదో, మాటల్లోకి అమె గుండె లోంచి అనువాదం కాలేదు.

నాగావళి నది దాటి - ఆవలి ఒడ్డుకు చేరటం.. బాల్యం నాటి తీయని అనుభూతి. ప్రభాకర్‌తో - ఈ దగలిగే యీడు కుర్రవాల్లు యెవరు లేరు ఆ రోజుల్లో!

నాగావళి నిండుగా ప్రవహిస్తోంది. ఒడ్డుమీద రెల్లు పొదలు మెత్తగాతలలూపు తున్నవి. పడవ వేసే భీమయ్య -- పదాలు పాడుతున్నాడు .

మాధవీ, ప్రభాకర్ మౌనంగా పడవ యెక్కారు. వారితోపాటు, అయిదారుగురు రైతులు పడవెక్కారు. వారిలో భూలోక భర్త వున్నాడు. పడవ నీటి మీద తేలుతూ కదిలింది.

"ప్రెబాకరు బాబూ - యీయమ్మ, మీ యిల్లాలా?" అడిగేడో రైతు,

"ఈ సూట్‌కేసు - నీదే?" అని, ప్రభాకర్ దగ్గరి సూట్‌కేసు ఆరా అడిగినట్లుగా అన్పించిందా ప్రశ్న మాధవికి.

"పిల్లలా..?" మరొక రైతు ప్రశ్న. మీ దగ్గిర లేరా? ఏమీ? అదేటి?" ప్రశ్నలు వేసి, జవాబులు రాబట్టి, వాటి మీద వారి అభిప్రాయాలను, హావ, భావ విన్యాసాల్తోవ్యక్తం చేస్తున్నారు. వాళ్లు దాచుకోవటం లేదు. దాపరికం లేని సంస్కృతి వాళ్లది.

"..సంపాదనకి రొండు సేతులు సాల్లేదన్న మాట. కాలం అలగే వుందిలే. అందలోకీ నగరంలోన సంసారం. నీళు కొనుకొవాల? పాలు కొనుకోవాల? ఇంటద్దిలే సగం సంపాదన మింగేస్తాయి, కద బాబూ..?

నగరంలో జీవన వ్యయం గురించి, వారి యెరుకలోకి వచ్చిన విషయాల్ని, మాట్లాడేరు రైతులు.

"లచ్చుమమ్మకి, యేమేనా సాయం జేస్తన్నారా బాబూ..?

గతుక్కుమన్నాడు ప్రభాకర్. మాధవి, ఆ ప్రశ్న తనకు కాదనుకుంది. ఎవరినుండీ, యేజవాబూ రాకపోయేసరికి, ప్రశ్నవేసినరైతే -

"..ఎవరి కడుపు ఆరికే భారమయి పోయిన రోజులివి ... " అని సమాధానం చెప్పుకున్నాడు.

పడవ ఆవలి తీరం చేరుకుంది. అందరూ, పడవ దిగి, బస్ రోడ్డు మలుపుదాకా కలిసి నడిచేరు.

".. వొస్తాం బాబూ, ఎమ్మార్వో ఆఫీసు కెళ్లాల ఇవతల రైతులం, అవతల గవర్మెంటూ.. మద్దెకాన నాగావొళి " వ్యథను వ్యక్తం జేసారు రైతులు.

రైతులకూ, ప్రభుత్వానికీ మధ్యవంతెన లేదంటున్నారా వీళ్లు.. ? తర్కించుకుంటున్నాడు ప్రభాకర్.

రైతులు, మాధవి దగ్గర కూడా సెలవు తీసుకున్నారు

ఇంతలో బస్ హారన్ విన్పించింది. మాధవీ, ప్రభాకర్ గబ, గబా నడిచి బస్ అందుకున్నారు. నాగావళి తీరం గుండా రోడ్డు మీద - పరుగులు తీసింది బస్.

ప్రభాకర్ కళ్ల నుంచి ఊరూ, నాగావళీ దూరమైంది. ఎవరి సీట్లలో వారు - వేర్వేరు గమ్యాలకు ప్రయాణించే తోటి ప్రయాణీకులు .. తన ప్రక్క మాధవి ! మళ్లీ మనసు ... తుఫాను గాలిలో తోట అయ్యింది. మాధవి వైపు చూసేడు. మాధవి, ప్రశాంతంగా సీటు పై వాలి .. కళ్లు మూసుకుంది. ఆమె అనుకున్నట్టే - పాపను అప్పజెప్పేసింది గదా ... అందుకే, అలా హాయిగా రిలాక్సయ్యింది. తనే .. యే విధంగానూ సంతృప్తి పడలేక పోతున్నాడు.గమ్యం వేరయిన మనిషితో.. ప్రయాణం చేస్తున్నట్టన్పించింది చిత్రంగా !అలా, అన్పించాక, ఒంట్లో నీరసం చేరుకుంది. అసంకల్పితంగా సీటుపై వాలి, కళ్లు మూసుకున్నాడు.

బస్సు ... నిర్వికారంగా రోడ్డు మీద పరుగులు తీస్తోంది....

★ ★ ★

రెండు నెలలు గడిచేయి. ఈ రెండు నెలల్లో పాప - మాధవిని మర్చిపోయింది. లచ్చుమమ్మే తల్లి ! రెండు దఫాలు వచ్చింది మాధవి. వచ్చినపుడు, పాప కోసం తెచ్చిన ఆట వస్తువుల్ని ఆకర్షణగా పెట్టి

- పాపను చేరదీ యాలనుకుంది మాధవి. గానీ, అది యెంతో సేపో సాగటం లేదు. కొద్ది సేపయ్యాక, మాధవి నుంచి పారిపోయేది పాప. మాధవికి - ఒకవైపు - రిలీఫ్ గానూ, మరోవైపు వ్యక్తం చేయలేని ప్రెజర్‌గానూ వుండేది.

ఈ రెండు నెలల్లో ప్రభాకర్ - మూడు దఫాలు వచ్చేడు. ఎప్పుడూ. మాధవీ, ప్రభాకర్ యిద్దరొకేసారి రాలేదు.

లచ్చుమమ్మ కు.. లీలగా అర్ధమవుతోంది. గానీ, యేంచేయాలో తెలీక సతమతమవుతోంది. కొడుకూ, కోడలూ.. బయటపడకుండా గడుపు కొస్తున్నా- ఘర్షిస్తున్నారని గ్రహించింది. గానీ, తను కల్పించుకొని, యేం చెప్పాలో అర్ధంగాక తపనపడసాగింది.

మూడో నెల మధ్యలో ప్రభాకర్ లాంగ్‌లీవ్ పెట్టి వచ్చేసాడు.

"... నన్ను నేరస్థురాల్ని చెయ్యటానికా ?" మూడో దఫా వచ్చినపుడు, విషయం తెలిసి, అత్తయ్య యెదుటనే తగవుకి దిగింది మాధవి.

"కొన్నాళ్లు యిక్కడ వుండాలన్పించింది. మనసు బాగోలేదు. వచ్చేను..." ప్రభాకర్, నిజంగా, ఆ కారణంగానే వచ్చేడు.

"ఈ ఊరి వాళ్ల వద్దా అత్తయ్య వద్దా నన్ను దోషిని చెయ్యాలనే, యిలా చేసారు. మనసు మీవొక్కరికేనా ? నేనెంత దహించుకు పోతున్నానో, యెవరికి చెప్పుకోను..." గొంతులో దుఃఖం పొంగి, మాధవి కళ్లల్లో నీళ్లు కదలాడేయి.

"... యిపుడేటయ్యిందమ్మా. రెండు రోజులుండి, ఆడే యెల్తాడు ... " సర్ది చెప్పింది లచ్చుమమ్మ.

"కాదు, ఆవిడగారి ట్రైనింగయ్యేదాకా యిక్కడే వుంటాను.. " ప్రభాకర్ నిర్ణయాన్ని చెప్పాడు.

".. యిలాంటి ఫీట్స్.. నాచేత ట్రైనింగ్‌ని డిస్ కంటిన్యూ చేయించలేవు" మాధవి స్థిరంగానే పలికింది లోలోపల వ్యధపడ్తున్నా .....

" నీకన్నీ ఫీట్స్ అన్పిస్తాయి. ఫీలింగ్స్ ఎపుడర్ధమయ్యాయి?"

ఆ మాటతో, యెక్కడో గట్టు తెగింది. దుఃఖమంతా భళ్లున వొలికింది.

".. అవును. నాకు ఫీలింగ్స్ అర్ధం కావు. నాలో ఫీలింగ్స్ లేవు. హరించుకు పోయేయి. ఎందుకు హరించుకు పోయేయో ? ఎపుడు హరించుకు పోయేయో యిప్పుడు తెలిసింది. నువ్వే, నువ్వే నా ఫీలింగ్స్ ని హరించేసావ్.. " భోరున యేడుస్తూ, గోడకు చేరబడింది మాధవి.

మనసెరిగిన మనిషితో సహజీవనం, సాఫీగా సాగిపోతుందనుకుంది మాధవి. ప్రేమించి పెళ్లి చేసుకున్న.. తమ మధ్య.. యింతటి అగాధం వుంటుందనుకోలేదు. ఇంటిపనీ, వంటపనీ, యెంత భారం ? ఆ భారం.. యే మాత్రం మోస్తున్నాడు ప్రభాకర్ ? తను మోసే భారంలో.. యెంత శాతం ? ఆ భారం నుంచి కొంత వెసులుబాటు కోసం - కొన్ని కన్స్యూమర్ గూడ్స్ కొన్నపుడు - వాటి కోసం .. ఘర్షణ

తనేమీ పెద్దపెద్ద కోర్కెలు పెట్టు కోలేదు, అందరి లాగానే బతకాలనుకుంది. భర్తకు సహకారంగా వుండాలనుకుంది. ప్రైవేట్ కంపెనీ లో పనిభారం యెక్కువయినా - నౌకరీలో చేరింది. అక్కడ, మేనేజర్ జులుం .. భరించాల్సి వచ్చేది. తను యేం చెప్పినా - మేనేజర్ అంగీకరించడు. తను తప్పులు చేసేదిగానూ,

మేనేజర్ ఆ తప్పులు దిద్దేవాడిగానూ.. ప్రభాకర్ గూడా - కొన్ని సందర్భాల్లో - తనపట్ల యిలాగే. నెట్టుకు వచ్చింది. సర్వీస్ పెరిగింది. పై కేడర్‌కు - ప్రమోషన్ వచ్చే అవకాశం వచ్చింది. ఏడాదిపాటు - మంగుళూరు ట్రెనింగుకి వెళ్లాలి. ట్రెనింగయిపోయి, ప్రమోషన్ పొందితే - మేనేజర్ జులుం పరిధిని - దాటి పోవచ్చు. బాబుని రెసిడెన్షియల్ కాన్వెంటులో చేర్పించినపుడు వెల్దామనుకుంది. ప్రభాకర్ వెళ్ల నీయలేదు.

ఏడాది పాటు యెంత మధనపడిందో..... ! ఖర్చులు పెరిగాయి. పాప పుట్టింది సెలవులు, ఆసుపత్రి ఖర్చులు అప్పులు ప్రభాకర్ లెక్కబెట్టి యిచ్చే జీతపురాళ్ల యిటు కంపెనీలో మేనేజర్ జులుం... ఇద్దరు బిడ్డల్తో తమ సంసారం .. యింత సాగరమా ?

చిన్న నాటనే తల్లీ ,తన పెళ్లి జరిగిన యేడాదికి తండ్రీ మరణించేరు. అన్నదమ్ములు యెవరి బ్రాకెట్లలో వారి బ్రతుకులు ఎవరితో కడుపు శోకం చెప్పుకోవాలి ....?

కుమిలి కుమిలి .. యేడు స్తోంది మాధవి.

ప్రభాకర్... తల దించుకున్నాడు.

లచ్చుమమ్మ తీవ్రంగా కలతపడింది. ఎందుకో. ఆ క్షణాన, ఆమెకు తన అత్తగారు గుర్తొచ్చేరు.

లచ్చుమమ్మ... ఆ రోజు ... మాధవిలాగే కుమిలి కుమిలి యేడ్చింది. చదువుకుంటోన్న తన పెద్దకూతురుకు - చదువాపేసి, మేనల్లుడితో పెళ్లి నిర్ణయించేడు భర్త. పదహారేళ్లగా - సఖ్యతా ఘర్షణా సాగిస్తూ భర్తతో నడిచిన లచ్చుమమ్మ పెద్దకూతురి బ్రతుకు కోసం యేడ్చింది.

".... కొడుకని కొడుకు మాట పలకను. నువ్వు యీ యింటి కొచ్చిన మా లక్ష్మివి. లచ్చుమమ్మా లెగు, లెగు, ఏడకు, కలకంఠి కంట నీరు - యింటికి చేటు అంటారు. లెగు, యేడకు. నువ్వు పెనిమిటిని మార్చుకొస్తన్నావు. మా కాలంల మాకు అది సేతకాలేదు. అరనిమసం అందివ్వాల్సిన వొస్తువు ఆలిసిమైతే సాల్ను మీ మామ నామీదకి చెయ్యేత్తీవోడు. కూరలో ఉప్పు.. యెక్కువా, తక్కువా అయితే సాల్ను.. యెగిరిపడేవి గిన్నెలు, నోరిప్పడం ప్రమాదం, నోరు మూసుకు బతికినాం.నువ్వా తక్కువ వఅనుభవించ లేదు. అయితొకటీ, మాలాగ వొల్లకోలేదు. నీపెనిమిటి తోటి నువ్వు కొట్లాడినావు. మంచికి మంచన్నావు చెడ్డకి చెడ్డన్నావు. అలిగీ, పోరుబెట్టుకొని వొస్తన్నావు.

లచ్చుమమ్మా - ఆడపుట్టుక పుట్టేక యిన్నితోవలు లేవు. సయించుకొని, సరిపెట్టుక బతికీడమా ? కొట్లాడటమా ? రెండే తోవలు. ఏడుపు యే తోవకీ సెందదు..."

అత్తగారు అన్న మాటలు.. యింకా, అలా గుర్తున్నాయి లచ్చుమమ్మకు.

లచ్చుమమ్మ, మాధవి వైపు సానుభూతితో చూసింది. ఆమె తల మీద చేయి వేసి దగ్గరకు తీసుకుంది.

తను - తన అత్తగారికి యెరుకయి నట్టుగా .. మాధవి తనకు యెరుకగావటం లేదు. మాధవి మనసులో యే వ్యధ వున్నదో, బ్రతుకులో యే బాధ వున్నదో... తెలియని దూరం.

లచ్చుమమ్మ కొడుకు వైపు చూసింది. ప్రభాకర్ గురించి అంతా తనకు తెలుసు. తన ఒడిలోంచి.. యెదిగిన కొడుకు. మరిపుడు. మార్పేమన్నా వచ్చిందా ? అప్పటి కొడుకు...

భర్త జూదానికీ, సారా వ్యసనానికీ.. భూము ల్ని ఆర్పేస్తుంటే - లచ్చుమమ్మ అడ్డుకునేది. మరదుల్ని సాయం తీసుకునేది.

ఇంటా, బయటా ఓడిపోతోన్న భర్త... రోజూ లచ్చుమమ్మని ఒట్టి పుణ్యానికే కొట్టేవాడు. అయినా భరించింది. భూములు తరిగిపోకుండా, కుటుంబం చిదిగిపోకుండా.. తాపత్రయ పడింది.

ఒక రోజు. కోడి పందేల కోసం భర్త లచ్చుమమ్మ కన్నవారి యింటి నుండి అరణం తెచ్చిన ఆవుని అమ్మేసాడు, లచ్చుమమ్మకి - ఆ ఆవుతో అనుబంధం పుట్టింట నుండీ ముడిపడి వుంది. ఆవుని అమ్మివేయటం భరించలేక పోయింది. అపుడు జరిగిన ఘర్షణలో - భర్త లచ్చుమమ్మను పిల్లల్తో సహా యింట్లోంచి గెంటేసాడు.

పుట్టినిల్లు, మెట్టినిల్లు - ఒకే ఊరిలో గావటంతో - లచ్చుమమ్మ పిల్లల్తో కన్న వారిల్లు చేరింది. ఏడాది పాటు కన్నవారింట వుండి పోయింది. ఆ యేడాదిలో.. అత్తవారింటి వైపు చూపుగూడా లేదు. ఎప్పుడన్నా తండ్రి యెదురయితే - పెద్దకూతురు, పెద్ద కొడుకు మాట్లాడేవారు గానీ ప్రభాకర్ పలికేవాడు గాదు. శత్రువులా భావించి - యీసడించుకు తన దగ్గరకు వచ్చేవాడు.

అలాంటి ప్రభాకర్... మరి .. ?

లచ్చుమమ్మ నిర్ణయానికి రాలేక పోతోంది.

కాదు, ప్రభాకర్ తప్పుచేయడు. అందరి లాటి వాడు కాడు.. ? అయితే, మాధవిదేనా తప్పు.. ?

సర్వమూ శూన్యమయ్యేక శోకించేట్లుగా శోకిస్తోన్న మాధవిదీ తప్పు కాబోదు.

ఎక్కడో, యీ యిద్దరి విరోధానికీ మూలముంది. ఈ యిద్దరి దుఃఖానికీ.. యేదో కారణం - అదేమిటి ? అంతుపట్టడం లేదు లచ్చుమమ్మకు.

తను యెరిగిన, తన కుటుంబంలోని, మూడు తరాల దంపతులను కలబోసుకుంది. తన అత్తా మామలు, తనూ, తన భర్తా, కొడుకూ కోడలూ! తనదాకా అర్థమయ్యేట్లుగా కనిపించే జీవితం - తన కొడుకూ కోడలి దగ్గర కొచ్చేసరికి అస్పష్టమైపోయింది.

మరో వైపు ఆలోచించింది.

తన మామ మంచివాడా, చెడ్డవాడా అని తర్కించుకుంది. లోకం అప్పటి కలాగుంది. ఆడదాని మీద పెత్తనం చేసాడు మామ. మరి తన భర్త..?

లోకం కొంత మారింది. దొరల రాజ్జెం రాకా, పోకా జరిగింది. ఆడవాళ్లకి చదువులు, ఊళ్లకి స్కూళ్లు, రాజకీయాల్లోకి ఊళ్లూ.. ఆడవాళ్లకు... యింటి బయటి ప్రపంచం దృగ్గోచరం కావటం

ఏదో కోల్పోతున్న భావనతో.. భర్త తన పై దాడి చేసేడేమో!

అంతటితో ఆగిపోయింది. తన దాంపత్యం దాకా విశ్లేషించుకున్న లచ్చుమమ్మకు తర్వాత సాధ్యం కావటం లేదు. ఇప్పటి సమాజంలోని వేగవంతమైన మార్పులు ఆమెకు అర్థం కావటంలేదు.

"... కుమ్మరోడితోటి సాల్లేక కుండలు చిదగ్గొట్టేడట.. నీలాటోడే" భూలోక కేకలు విన్పించేయి.

లచ్చుమమ్మ.. ఆ కేకల్ని విని చిరాకు పడింది. భూలోకగానీ, యీసారి తగువు మోసుకుగడపెక్కితే, గసిరేసి తగిలేయాలనుకుంది. అయితే, భూలోకగానీ, భూలోక భర్తగానీ.. యీసారి వారి తగువుని మోసుకు

రాలేదు. వారి వాకిటలోని కేకలు వేసుకుంటున్నారు. వాళ్ల కేకలు వినిపించటమేగాక, వాళ్లిద్దరూ సొంతం కన్పిస్తున్నారు.

".... సూస్తావు గదే ? ఇదేటి నా వొక్కడి యవ్వారం కాదు ఊరందరిది. అపుడు, రేసన్ కార్డులపుడూ, అలగే దెబ్బగొట్టేరు. ఈసారి అదేటి కుదర్దు. అలగయితే అగ్గి తీసేస్తాం.. ! ఆఁ...ఎమ్మార్వో ఆపీసు, గిమార్వో ఆఫీసు.. ఎక్కదీసి యేటిల కలిపెస్తాం..

" ఒసే, ఒసోసే.. ఆ మోజారు కబుర్లేవొద్దు. పెళ్లం మీద కలబడినట్టగ పెడోళ్ల( పరాయోళ్ల) మీద కలబడిపోకు" భూలోక భర్తను హెచ్చరిస్తోంది.

పట్టాదారు పాసు పుస్తకాల కోసం గ్రామ రైతులు ఎమ్మార్వో ఆఫీసుకి దరకాస్తుల్తో వారధి గట్టేరు. విజ్ఞప్తులు చేసారు. విసుగెత్తి పోయేరు. రైతుల విసుగు .... ప్రస్తుతం... యిళ్లల్లో ప్రతి పలిస్తోంది. భూలోక దంపతుల ఘర్షణ... దాని ప్రతిఫలనమే !

మాధవి, కళ్లు తుడుచుకొని, అలా గోడకి చేరబడింది. ప్రభాకర్ మౌనంగా, భూలోక యింటివైపు చూస్తున్నాడు.

"అన్నీటికీ పాసు పుస్తకాలతోటి - లంకె పెట్టారు. బేంకు అప్పులు, కోటా సరుకులు, ఎరువులకి... అన్నిటికీ పాసు పుస్తకాలడుగుతారు. ఆళ్లు, ఆ రెవిన్యూ వోళ్లేమో - ఫోటోలడుగుతారొకసారి, ఇంటి నెంబరింకొకసారి, కుటమాంబోగట్టా వొకసారి - యిలాగ ఒకటి తరాతొకటి అడుగుతారు. అన్ని భోగట్టాలిచ్చినా - పుస్తకాలు యివ్వరు మరింకేటి గావాలో ... ఆళ్లకి ?"

లచ్చుమమ్మ.... కాస్త తెరిపిన బడింది. ఇంటి నుంచి - ఊరిలో విషయానికి మళ్లింది. పాసు పుస్తకాల భోగట్టా ... భూలోక దంపతుల తగవు నేపధ్యంలో చెప్పింది.

".. అక్కా, బావ... వివరాలన్నీ యిచ్చేముగదా. పిల్లల పేర్న మార్చి యిస్తామన్నారు గదా - యేమైందమ్మా ?" అడిగేడు ప్రభాకర్.

ప్రభాకర్ అక్కా, బావ - యిద్దరూ, తీర్థయాత్రలకు వెళ్లినపుడు జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయేరు. ఇద్దరి పిల్లల్ని లచ్చుమమ్మకు అప్పగించి తీర్థయాత్రకు వెళ్లేరు. చదువాపేసి, పెళ్లి జేసినందుకే యేడ్చిన లచ్చుమమ్మ - పెద్దకూతురు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయినపుడయితే - పిచ్చిదయి పోతుందను కున్నారంతా, గానీ, లచ్చుమమ్మ - దుఃఖాన్ని గుండెల్లోనే దాచుకొని, మనుమల్ని ఒడిలోకి తీసుకుంది. వారి సంరక్షణ బాధ్యత స్వీకరించింది. కొడుకులు పెళ్లిళ్లూ, యెవరి దారులు వారు చూసుకున్నాక, భర్త గూడా కన్నుమూసేక - లచ్చుమమ్మ... మనుమల్ని సంరక్షణ చేసుకుంటూ, వారి భూమిని సాగు జేయించుకు వస్తోంది. అల్లుడి వైపు అన్నీ ... తమ భర్త వారే కావటం వల్ల - లచ్చుమమ్మ... యీ బాధ్యత, కూతురి పిల్లలనేగాదు, ఆ వైపు నించీ ఆలోచించి స్వీకరించింది.

"...యిస్తా మంటారు. ఫోటోలడిగినారు. పిల్లలిద్దరివీ యిస్తే - మైనరు పిల్లలా అన్నారు. మరేం పేచీ పెడతారో..." ప్రభాకర్‌కి జవాబు చెప్పింది లచ్చుమమ్మ.

"...మా స్నేహితురాలు - ఎమ్మార్వో ఆఫీస్‌లో పనిచేస్తోంది. తనకి చెప్పమంటారా అత్తయ్యా ?' ' తన శోకంలోంచి తేరుకొని, అడిగింది మాధవి.

"....ఊరందరూ - పుస్తకాల గురిండనే ఒక్కటయినారు. సంగం గట్టేరు. ఊరికి కావలసిన సదుపాయాల గురిండే అందరూ అలజడి జేస్తున్రు. ఊరు, ఊరంతా వొక్క మాట మీద నడుస్తంది. పండుగంత సంబరంగా వుందమ్మా అందరితోటి వొస్తే రానీ! లేకపోతే అందర్తోనిదే మన దారీ.. " జవాబు చెప్పింది లచ్చుమమ్మ.

ఆ జవాబుని విశ్లేషించుకుంటే.. యెన్ని విషయాలు బోధపడేవీ. ఉమ్మడిలోంచి .. వ్యష్టిపురోగమనాన్ని ఆశించటం .. దాని కోసం ఎవరి పరుగులు వారివి కావటం ఎవరు వెనుకబడినా .. కారణం ప్రక్కవారు అనుకొని .. ఘర్షించటం .. మాధవి అంతదాకా ఆలోచించలేదు. ఆమెకు .. మరేదో గుర్తొచ్చి -

"... వొంట్లో బాగులేదని పది రోజులు సెలవు పెట్టాను" అంది. ఆ మాట ప్రభాకరం కోసం అన్నదా ..?

లచ్చుమమ్మ ఆందోళనగా..

".. అయ్యయ్యో, చెప్పవేమమ్మా? ఇంటికి రాగానే తగువుల పడిపోనారు. ఏటయ్యిందమ్మా ?డాక్టరుకి చూపించేవా ? " ప్రశ్నించింది.

అత్తగారి ఆదరానికి ఆశ్చర్యపోతోంది మాధవి. సాదారణంగా .. అత్తలు కోడళ్లను సాధిస్తారంటారు. తను, యీ విషయంలో అదృష్టవంతురాలనుకుంది.

ప్రభాకర్‌లో గూడా.. తొలినాళ్లలో యెంత ఆదరణ!

ప్రయాణ ఆరంభాన్ని మర్చిపోతే గమ్యం శిధిలమవుతుంది.. ఆలోచిస్తోన్న మాధవికి .. యెక్కడో చదివిన ఆ వాక్యం గుర్తొచ్చింది. ఒక్కసారి గుండెలో వేగం పుంజుకుంది. ప్రయాణ ఆరంభాన్ని మర్చి పోయి .. యెంత దూరమొచ్చాము ? మర్చి పోయినది ప్రభాకరా ? తనా ? ఇద్దరూనా .. ? యెక్కడో, యేదో, యెరుకలోకి రాని అంశంతో .. అంతస్సంఘర్షణకు గురయ్యింది మాధవి.

అత్తగారు చేత్తో తట్టి, మళ్లీ ప్రశ్నించేరు. మాధవి తేరుకొని-

" యేం లేదత్తయ్యా కొన్నాళ్లు యింట్లో వుండాలన్పించింది. సిక్ అయితే లీవ్ శాంక్షన్ చేస్తారు. జబ్బేం లేదు. సెలవు కోసం.. అలా చేసాను.." అని చెప్పింది.

లచ్చుమమ్మ .. ఆ జవాబుతో కాస్తానెమ్మది పడినా, అనుమానంగానే చూస్తోంది. ప్రభాకర్ మాత్రం .. మాధవి మాటల్ని విడదీసుకు చూస్తున్నాడు. "ఇంట్లో వుండాలన్పించి .. " అంటే .. యేయిల్లు ? ఇక్కడా ? లేదా తనతో అక్కడా? ఆ ప్రశ్న రాగానే .. ప్రభాకర్ ఓ క్షణం విలవిల్లాడేడు. భోరున యేడ్చిన మాధవి రూపు మళ్లీ కదల డింది మనసులో.

ఏడ్చేవాళ్లను చూస్తే .. ప్రభాకర్‌కి లోలోపల .. యెప్పుడో.. చిన్ననాడు.. తల్లిని చుట్టుకు .. విలపించిన తన దీనరూపమే గుర్తొస్తుంది.

"అక్కడకు ఉత్తరం గూడా రాసేను.." ప్రభాకర్‌కే చెప్పింది మాధవి.

"... అయితే పాపను తీసుకొని వెళ్దామా ? " దోషాన్ని అంగీకరించే స్వరంతో, ప్రభాకర్

" మరెందుకర్రా? యిక్కడే వుండొచ్చు గదా.."

"అది కాదత్తయ్యా, ఆయన సెలవులెందుకు ఉత్తనే ఖర్చు? అదీగాక, బాబు అక్కడే గదా.

హాస్టల్‌కి వెళ్లి, వాడినీ చూడొచ్చు. తిరుగు ప్రయాణంలో, పాపని మీదగ్గర దించేసి, యిటునించిలా.. ట్రెనింగ్‌కి వెళ్తానత్తయ్యా మాధవి, అంతలోనే ప్రణాళికాబద్ధంగా అన్నీ నిర్ణయించి చెప్పింది.

ఈ తరం వారి .. ప్రత్యేకతే అది.

వాళ్లు, కలహం మానేసి, కలిసిపోయి నందుకు సంబరపడి, లచ్చుమమ్మ "సరే .. మీ యిష్టం..' ' అంది.

★ ★ ★

ఏ డాది తిరిగేసరికి, మాధవి ట్రెనింగ్ పూర్తయ్యింది. పాపను తీసుకొచ్చి తమ దగ్గరే వుంచుకున్నారు. మాధవికి .. ప్రమోషన్ వచ్చింది. సెక్షన్ మారింది. మేనేజర్ జులుం పరిధిని దాటిపోయింది. ఇపుడు, తనూ.. వొక అధికారే.

పెరిగిన జీతం, మాధవిని "దివ్యరియల్ ఎస్టేట్" స్కీములో సభ్యత్వానికి లాగింది. మళ్లీ మామూలే... చాలీ చాలని బడ్జెట్ నిదులు. ఇన్ స్టాల్‌మెంట్ల చెల్లింపులకే... యింకిపోయే జీతాలు.

ఇదంతా ప్రభాకర్‌కి నచ్చదు.

ఇవన్నీ అవసరాలే అంటుంది మాధవి. అసెట్స్.. గదా అంటుంది. అప్పుజేసి, అసెట్స్ కూడగట్టడం.. వాటి కోసం.. నౌకరీ చాకిరీ ..

అసలివన్నీ అవసరాలేనా ? అవసరాలుగా మనకు అలవాటు జేసి .. యెవరో మన రాబడులను యెత్తుకుపోతున్నారా ? ప్రభాకర్‌కి యీ ప్రశ్నకు .. జవాబు దొరకలేదు.

మాధవి .. యీ ప్రశ్నలే అర్థం లేనివను కుంటున్నది.

ఎనిమిది నెలల వాయిదాలయ్యేక .. జరిగిన "డ్రా" లో "దివ్య రియల్ ఎస్టేట్" లో హౌస్ ప్లాట్ లాటరీ తగిలింది మాధవికి.

ఇక అక్కడి నుంచీ, ఆ ప్లాట్ తన పేర రిజిస్టర్ చేయించుకోవటం, దానికి చేయాల్సిన అప్పులు.. యీ యాతనలో కొన్ని నెలలు గడిచేయి.

పాపకు మూడేళ్లు నిండేయి. మాధవి.. మనసులో .. స్వంత ఇల్లు రూపుదిద్దుకో సాగింది. ఇంటి నిర్మాణానికి .. ఆర్థిక సహాయమందించే సంస్థల గురించి ఎంక్వయిరీ చేయసాగింది.

ప్రభాకర్‌కి .. నగరంలో ఇల్లు యిష్టం లేదు. తన ఊరిలో, నాగావలి తీరానికి దగ్గర్లో .. ఇల్లు కట్టుకోవాలని వుంది.

" ... అంతగా మీకిష్టమైతే, రిటయిరయ్యేక మీరు, మీ ఊరిలో కట్టుకోండి, నేనూ, పిల్లలూ మాత్రం .. నగరంలోనే వుంటాం. పిల్లలకి .. ఆ పల్లెలో .. యేం ఫ్యూచర్ వుంటుంది.?"

మాధవి ప్రశ్నే జవాబుతో కూడుకున్నది. ప్రభాకర్ మరింకేమీ మాట్లాడ లేదు.

మాధవి ప్రయత్నాల ఫలితంగా, హెచ్.డి.ఎఫ్.సీ. వారు ఋణ సహాయం అందించటంతో .. యింటి పని ఆరంభమైంది. ప్రభాకర్ గూడా, యింటి పనుల్లో పూర్తిగా సహక రించేడు. ఆ సందర్భంలోనే స్వల్ప ఘర్షణ అనంతరం .. పాపను రెసిడెన్షియల్ కాన్వెంటులో చేర్పించారు.

ఇంటి పని .. స్లేబ్ లెవెల్ వరకూ వచ్చింది.

మళ్లీ .. మరో హంసపాదు....

మాధవికి .. యేమీ తోచలేదు. ఇపుడేం చేయటం .. ?

"నేనేం మాట్లాడను. నీయిష్టమొచ్చినట్టు నువ్వు చెయ్యి .. "

"అలాగంటావేం ? నా యిష్టమేంటి ? నా యిష్ట ప్రకారమూ నడవటం .. మన పెళ్లయ్యాక ఆగిపోయింది. నాయిష్టాల్ని చంపుకున్నాను.. "

"నువ్వేం చంపుకున్నావు? నేనూ.. అన్నీ చంపుకున్నాను.. పిల్లలకు దూరంగా, తల్లికీ, పల్లెకూ దూరంగా.."

".. నాకోసమా ? " గొంతులోంచి దుఃఖం తన్నుకొస్తుంటే అదుముకుంటోంది మాధవి.

రోషంతో కళ్లు యెర్రగా అయిపోయేయి. శరీరమంతా .. ఆవేశంతో కంపిస్తోంది. చేతులు విసుర్తూ మాధవి-

" .. ప్రమోషనా ? బదిలీయా ? అన్న ప్రశ్నమీకే అయితే .. యింత చర్చ వుంటుందా యింట్లో? నాకు గాబట్టి .. మీ అనుమతి కావాలి. పిల్లలో .. అంటారు. పిల్లలూ, యిల్లూ, భర్తా .. అన్నీ ఆడదానికే ఇక్కడ్నించి ముందుకి అడుగేస్తే మీ దృష్టిలో దోషులం. అన్నీ వొదులుకొని .. యింట్లో వుండిపోతే .. బెటర్ హాఫ్ లం! ప్రవాహంలా వస్తోన్నయి మాటలు!.

ప్రభాకర్‌కి. అర్థమవుతోంది. గానీ, పరిష్కారం దగ్గరకు వచ్చేసరికే - తన యిచ్ఛకు వ్యతిరేకమౌతోంది. పరస్పర వ్యతిరేక యిచ్ఛలకు వేసిన బంధమా దాంపత్యం? సమాంతరంగా.. ప్రయాణించే సంసారిక యాత్రికులా దంపతులు?

ప్రమోషన్ వచ్చేక గూడా యింతదాకా కొత్త సెక్షన్లో పనిజేసిన మాధవికి - ఆసెక్షన్ కలకత్తాకు మార్చివేయటంతో - అక్కడికే బదిలీ చేసారు. బదిలీ ఉత్తర్వులు రద్దుగావాలంటే - ప్రమోషన్‌వొదులుకొని, మళ్లీ పాత స్థానంలో మేనేజర్ క్రింద పనిచేయాలి! మాధవి - యేమీ తేల్చుకోలేక గింజుకుంటోంది. గింజులాటాలో సహకరిస్తాడనుకున్న ప్రభాకర్.. ఘరిస్తుంటే - యిరిటేషన్‌కి గుర్రైంది. భార్యా భర్తల అనుబంధమనే సున్నిత పొర మీద - శరపరంపరలు విసిరింది. ప్రభాకరూ తగ్గలేదు.

ఇద్దరూ - నిదానంగా కూర్చొని -యిరు వైపులా సమస్యని ఆలోచించుకోలేదు.

అప్పుడే - పోస్ట్‌మెన్ వచ్చి లెటర్ యిచ్చేడు.

లచ్చుమమ్మకు అరోగ్యం బాగోలేదని ఉత్తరం!

ప్రభాకర్.. ఉత్తరాన్ని.. అలా జార విడిచేసి బయలుదేరి పోయేడు. కాన్వేంట్‌కి వెళ్లి పాపను తీసుకొని, అట్నించటే - ఊరువెళ్లాడు.

మాధవికి ప్రభాకర్ చర్య అర్థం కాలేదు! తన బదిలీ సమస్య తేల్చలేదు. తనను పిలవ లేదు. ఇంటి పని గురించేమీ మాట్లడలేదు.. ఇన్ని సమస్యల మధ్య తనను వొదిలేసి..? మాధవి మరి ఆలోచించలేక, నిస్సత్తువగా సోఫాలో కూలబడింది.!

ప్రభాకర్ ఊరిలోకి వెళ్లేసరికి - ఊరంతా ఉద్రిక్తంగా వుంది. మూడేళ్లుగా, సాగిన పట్టాదార్ పాసు పుస్తకాల ఆందొళన - రైతుల అరెస్టుల దాకా వచ్చింది. ఊరిలో రైతులందరూ అరెసుఅయ్యరు .

ఊరిలో మిగిలిన మహిళలు, అరెస్టు గాకుండా అజ్ఞాతంలో వుండి ఉద్యమాన్ని నడిపే సంఘం నాయకులూ.. భవిష్యత్ కార్యక్రమాన్ని చర్చించుకుంటున్నారు ఊరిని ఆనించిన తోటలో!

ప్రభాకర్, పాప - యింటికి చేరేసరికి - లచ్చుమమ్మ ఒక్కత్తే మంచమ్మీద వుంది. టైఫాయిడ్ జ్వరం. తల్లి మంచమ్మీదనే కూర్చున్నాడు ప్రభాకర్. పాప - నాయినమ్మ వైపు విచారంగా చూస్తోంది.

వీళ్లని గమనించి వచ్చిన భూలోక -

" యెంత పెద్దదయిపోనాది పాప .... అప్పుడే..." అని పలుకరించింది. లచ్చుమమ్మ మెల్లగా లేచి, మంచం తల దిండువైపు కూడదీసుకు కూర్చొని మనవరాలిని పిలిచి, అడ్డాలలో కూర్చోబెట్టుకుని-

"అమ్మ బాగుందమ్మా ?"

"అన్నయ్యో ....?

"బాగా, సదువుకుంటంద్రా.. ?"

అన్ని ప్రశ్నలకూ, సంతృప్తికరజవాబులు పొంది, హాయిగా శ్వాసపీల్చుకుంది లచ్చుమమ్మ. అప్పుడు-

"... వొద్దర్రా ఊష్టమే, తగ్గిపోద్ది, దగ్గిరా, దాపా.. గాభరాపడిపోతారు. ఉత్తరమొద్దన్నాను. ఇదిగో, యీ భూలోక, దీని మొగుడూ వొప్పేరు గారు.." కొడుకుతో చెప్పింది లచ్చుమమ్మ.

".. అత్తా, అందరూ బయలెల్లిపోనారు. నువ్వు మరి రాలేవుగదా. వొంటిలా బాగులేదు. ఇంటికా - సుట్టాలొచ్చేరు.. నీ నెల్తానయితే మరి .." అని చెప్పి, భూలోక నడువబోయింది.

".. ఊరి రైతులందర్ని జెయిల్ల బెట్టేరు. దీని పెనిమిటినీ అరెస్టు జేసారు. ఈ పొద్దు - ఆళ్ల కోసం .. ఆడోళ్లంతా ధర్నా. భూలోక.. లీడరిప్పుడు! మొగుడ్ని అరెస్టు జేసినపుడు చూసినావు గాదు నాయినా .. పోలీసోల పరువు తీస్సింది...భూలోక" లచ్చుమమ్మ హుషారుగా చెప్తోంది.

ప్రభాకర్ తల్లి మాటలు విన్నాక ఆలోచన లో పడిపోయేడు. కయ్యాలు ఆడుకోనిదే, పొద్దు గడవని భూలోక, భూలోక భర్త మధ్య ఐక్యత యెలా సాధ్యమయ్యింది ? వాళ్లలాగా, తామూ ఘర్షించుకుంటున్నాము. తమకీ, వాళ్లకీ.. భేద మేమిటి..?

భూలోక ప్రభాకర్ వైపు చూస్తూ..

" బాబూ, వొస్తాను.." అని చెప్పింది. ప్రభాకర్ తేరుకొని, భూలోకవైపు చూస్తూ ..

" ... మీ ఆయనా, నువ్వూ కయ్యాలు మానుకున్నారా, యేమిటి ? అతని కోసం నువ్వు .." నవ్వుతూనే ప్రశ్నించాలనుకున్నాడు గాని ఆ తర్వాత మాటలు రాలేదతనికి.

భూలోకకి అర్థమయ్యింది. చిన్నగా నవ్వి ..

" ... మా కయ్యాలన్నీ బతుకుకోసిమేని బాబూ. మా బతుకులికి సిక్కుముడులు యెక్కడున్నాయో తెలవక .. యిన్నాళ్లూ మా పిలకలు మేము పీక్కున్నాము. మా లోని మాకు కయ్యాలేటి ? " అక్కడితో విషయం అర్థమవు తుందన్నట్లుగా చెప్పి అక్కడి నుంచి ధర్నాలో పాల్గొనేందుకు వెళ్ళిపోయింది.

అప్పటికి .. ప్రభాకర్‌కి .. మనసులో బరువు తొలగినట్లయ్యింది. ఏదో విశదమయ్యిందేమో .. అతనికి ఆ క్షణాన .. మాధవి గుర్తొచ్చింది.

లచ్చుమమ్మా, మనుమరాలూ యేదో మాట్లాడుకుంటున్నారు.

" మా దగ్గర కొచ్చేయి నానమ్మా.. "

" నీ పెళ్లి దాకా బతుకుతానే తల్లీ నీ తల మీద అక్షింతలు యేసిగానీ .. కళ్లు మూస్తానేటి లచ్చుమమ్మ .. ఒక తరాన్నించి మరో తరం దాకా బంధాన్ని వేస్తోంది.

" .. అది గాదమ్మా, అక్కడ పెద్ద పెద్ద డాక్టర్లకి చూపించి.." ప్రభాకర్. గొంతులో మమతానురాగం పలికింది.

" యే మట్టిల పుట్టిన జీవికి .. ఆ మట్టిలోనే బతుక్కీ, సావుకీ మూలకాలుంతాయి. ఈ ఊరొదిలి.. రాలేన్నాయినా .. " అంది లచ్చుమమ్మ.

".. మాధవి, పరామర్శకు రాలేదని శంక పెట్టుకోలేదు గదమ్మా.. " తల్లికి దగ్గరగా జరిగి, ప్రశ్నించేడు ప్రభాకర్.

లచ్చుమమ్మ ఆ ప్రశ్నకు విస్తుబోయి .. తన మాటల్లో అలాంటి భావం వ్యక్తమయ్యిందా .. అని తర్కించుకుంటోంది.

" అఁహ, అప్పటికప్పుడు బయల్దేరటం గదా. ఒక్కడికే వీలయ్యింది. ఈ సారి యిద్దరమూ వస్తాము.. " సంజాయిషీగా చెప్పాడు ప్రభాకర్.

గానీ ప్రభాకర్, మాటల్లో.. ఆ తల్లి గ్రహించే సింది. అంతే, దుఃఖాన్ని ఆపుకోలేక .. కొడుకు తలను గుండెలకు ఆన్చి యేడ్చేసింది లచ్చుమమ్మ !

*(రచన మాసపత్రిక - జూలై 1997)*